
సాక్షి
ఒడిశా
గురువారం । 13 । మార్చి । 2025


శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు: రూ. 5.57.354
బంగారం: 3 గ్రాముల 400 మిల్లీ గ్రాములు
వెండి: 47 గ్రాములు - భువనేశ్వర్/పూరీ


భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు
జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ విషయంలో బీజేపీ ఎమ్మెల్యే జయనారాయణ మిశ్రా వ్యవహరించిన తీరుపై కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు.
- 8లో.


భార్యే హంతకురాలు - 8లో.
యువకుడి అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. భార్యే హంతకురాలిగా గుర్తించి అరెస్టు చేశారు.

న్యూస్‌రీల్

కారులో చెలరేగిన మంటలు

- డ్రైవర్ సజీవ దహనం


మంటలు అదుపు చేస్తున్న అగ్ని మాపక సిబ్బంది

భువనేశ్వర్: కారులో మంటలు చెలగిన ఘటనలో డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. పారాదీప్ భూతుముండై బిశ్వాలి కూడలి ప్రాంతంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న కుజంగ్ అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది. కాగా, కారు డ్రైవర్ ఎవరనేది ఇంకా తెలియాల్సి ఉంది.

హాస్టల్ ఘటనపై ఆరా


విద్యార్థులతో మాట్లాడుతున్న గొమాంగో, జితు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో అన్వేష హాస్టల్లో విద్యార్థిపై తోటి విద్యార్థుల దాడి ఘటనకు సంబంధించి వాస్తవాలు తెలుసుకునేందుకు బీజేడీ నాయకుడు, గుణుపూర్ శాసనసభ మాజీ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగొ, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జితు జకసిక మంగళవారం హాస్టల్‌కు వెళ్లారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. చదువుపై శ్రద్ధ కనబరిచి ఇటువంటి దారుణ ఘటనలకు దూరంగా ఉండాలని హితవుపలికారు. హాస్టల్ నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. ఈ నెల 4న ఘటన జరిగినా గుట్టు చప్పుడు కాకుండా దాచిపెట్టడం విచారకరమన్నారు. ఇంత జరిగినా అధికారులు తీసుకుంటున్న చర్యలు నామమాత్రమేనని అన్నారు. బాలుర హాస్టల్లో మహిళను సూపరింటెండెంట్‌గా నియమించడం సంక్షేమ శాఖ అధికారుల బాధ్యతారాహిత్య వైఖరికి నిలువుటద్దంగా నిలుస్తోందన్నారు.

కోళ్ల పెంపకంపై అవగాహన


కోళ్ల పెంపకంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయగడ: మహిళలు సామాజిక, ఆర్థిక రంగాల్లో పురోగతి చెందాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాల్లో భాగంగా జిల్లాలోని రామనగూడలో 90 మంది మహిళలను గుర్తించారు. వారికి కోళ్ల పెంపకంపై అవగాహన, చైతన్యం కలిగిస్తూ ప్రోత్సహించారు. ఈ మేరకు ప్రతీ ఒక్క మహిళలకు ఉచితంగా 28 రోజుల వయస్సున్న 45 కోడి పిల్లలను పంపిణీ చేశారు. వాటిని సంరక్షించి పెంచాలని అందుకు తగిన సూచనలు, సలహాలు ఎప్పటికప్పుడు ఇస్తామని పశు సంవర్ధక, ప్రాణి చికిత్స విభాగానికి చెందిన అధికారులు చెప్పారు. కోళ్ల పెంపకం ద్వారా ఆర్థికంగా ఎంతో మెరుగుపడవచ్చని ఈ సందర్భంగా వారికి అవగాహన కలిగించారు. ప్రతీ ఒక్క మహిళకు 500 రూపాయల నగదును వారి అకౌంట్‌లో ముందుగా జమచేశారు. కోళ్ల పెంపకానికి సంబంధించి అవసరమైన వాటిని నగదును వినియోగించాలని సూచించారు.

బైక్ చోరీ కేసులో ఇద్దరు అరెస్టు


పట్టుబడిన నిందితులతో పోలీసులు

మల్కన్‌గిరి: బైక్ చోరీ కేసులో పోడియా సమితి పోలీసులు మంగళవారం రాత్రి ఇద్దరిని అరెస్టు చేశారు. గత శుక్రవారం సాయంత్రం పోడియా సమితి కార్యాలయం వద్ద విజయ్ రాయ్ అనే వ్యక్తి బైక్ చోరీకి గురైంది. వెంటనే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కలిమెల సమితి ఎంవీ 79 ప్రాంతంలో ఓ వ్యక్తి వద్ద బైక్ ఉందని గుర్తించిన పోలీసులు వెంటనే అతన్ని అరెస్టు చేశారు. ఈ చోరీలో ఇద్దరు ఉన్నట్లు గుర్తించి మంగళ్ దాస్,అర్జున్ పాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఐఐసీ రామేశ్వర్ ప్రధాన్ తెలిపారు.

- పాత్రికేయులు మొబైల్ ఫోన్లు తీసుకురావద్దని ఉత్తర్వులు
- ఆందోళనకు దిగిన జర్నలిస్టులు
- ఉత్తర్వులు ఉపసంహరించుకున్న సర్కారు
- షరతులకు అంగీకరించిన పాత్రికేయులు

శాసనసభ వద్ద.. గందరగోళం


గాంధీ విగ్రహం వద్ద పాత్రికేయుల ధర్నా


అసెంబ్లీ ప్రెస్ గ్యాలరీ వద్ద గుమిగూడిన ప్రాతికేయులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టు

భువనేశ్వర్: రాష్ట్ర శాసనసభ వద్ద బుధవారం గందరగోళ వాతావరణం నెలకొంది. తొలుత ప్రెస్ గ్యాలరీలోకి పాత్రికేయులు మొబైల్ ఫోన్లు తీసుకెళ్లకుండా నిషేధించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేయడంతో భద్రతా సిబ్బంది విలేకరులు తమ మొబైల్ ఫోన్లు తీసుకెళ్లకుండా నిరోధించారు. ఈ చర్యకు నిరసనగా వివిధ మీడియా సంస్థల విలేకరులు బుధవారం ఉదయం నుంచి శాసన సభలో బడ్జెట్ సమావేశాల కవరేజి బహిష్కరించారు. సభా కార్యక్రమాలు జరుగుతుండగా అసెంబ్లీ ప్రాంగణంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద విలేకర్లు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

- ధర్నాలో బైఠాయించిన సీనియర్ జర్నలిస్ట్ భగత్ ప్రసాద్ త్రిపాఠి ఆకస్మిక అస్వస్థతకు గురయ్యారు. ఆందోళన సమయంలో స్పృహ తప్పి పడిపోవడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.
- మంగళవారం సభలో అధికార భారతీయ జనతా పార్టీ, కాంగ్రెసు సభ్యుల మధ్య జరిగిన తోపులాట దృశ్యాలు మీడియాలో విస్తారంగా ప్రసారం అయ్యాయి. సభ లోపలి వాస్తవ ఘట్టాలు బట్టబయలు కావడంతో మర్నాడు ఉదయం సరికి సభ ప్రాంగణంలోకి మొబైలు ఫోన్ నిషేధించినట్లు ఉత్తర్వులు జారీ అయినట్లు భావిస్తున్నారు.
- ఫోన్ల నిషేధం పత్రికా స్వేచ్ఛను దెబ్బతీయడమేనని పాత్రికేయులు ఎదురుతిరగడంతో ప్రభుత్వం పునరాలోచించింది. చివరకు అంచెలంచెలుగా పరిస్థితి అదుపులోకి వచ్చింది.
- ఆందోళన చేస్తున్న జర్నలిస్టుల్ని సర్ది చెప్పేందుకు శాసన సభ స్పీకర్ సురమా పాఢి, చర్చలకు పిలుపునిచ్చారు. ఆమె పిలుపు మేరకు పాత్రికేయుల ప్రతినిధి బృందం చర్చలకు హాజరైంది. ఈ చర్చలో రాష్ట్ర యువజన వ్యవహారాల శాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్ హాజరయ్యారు.దీంతో ఇరు వర్గాల మధ్య చర్చలు ఫలప్రదమయ్యాయి. షరతులతో కూడిన ఒప్పందంతో వివాదానికి తెర పడింది. నిరసనకు దిగిన మీడియా ప్రతినిధులు సైతం ఆందోళన విరమించినట్లు ప్రకటించారు. జర్నలిస్టులు మొబైల్ ఫోన్లను తీసుకెళ్లవచ్చని, అయితే ప్రెస్ గ్యాలరీ నుంచి ఫోటోలు, వీడియో రికార్డింగ్ చేయకూడదని స్పష్టం చేశారు. ఫోన్లు నిశ్శబ్ద మోడ్‌లో ఉంచాలని పేర్కొన్నారు. ప్రశ్నోత్తరాలకు సంబంధించిన అనుబంధ ఫొటోలను ప్రభుత్వమే మీడియా సంస్థలకు అందిస్తుందని చెప్పారు. సభ కార్యకలాపాలను కవర్ చేసే జర్నలిస్టుల కోసం శాసన సభ త్వరలో ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తుందని స్పీకర్ తెలిపారు.


స్పీకరు సురమా పాఢితో పాత్రికేయ ప్రతినిధుల చర్చలు

24, 25 తేదీల్లో రాష్ట్రపతి పర్యటన


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

భువనేశ్వర్: ఈ నెల 24న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల పర్యటనకు వస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా నయాగడ్, కటక్ జిల్లాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 24వ తేదీ మధ్యాహ్నం 1.30 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటారు. ఆ తర్వాత ఆమె వైమానిక దళ హెలికాప్టర్ ద్వారా నయాగఢ్ జిల్లాకు వెళ్తారు. అనంతరం నయాగడ్ జిల్లాలో పర్యటిస్తారు. ఈ పర్యటనలో భాగంగా కొంటిలో నీల మాధవ ఆలయంలో ప్రార్థనలు చేస్తారు. ఆ తరువాత కలియాపల్లిలోని భారతీయ విశ్వబసు సవర సమాజ్ ఫౌండేషన్ వార్షిక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ కార్యక్రమం తర్వాత భువనేశ్వర్‌కు తిరిగివచ్చి రాజ్ భవన్‌లో రాత్రికి బస చేస్తారు. మార్చి 25న భువనేశ్వర్ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో కటక్ సందర్శించనున్నారు. కటక్‌లో రెవెన్షా విశ్వ విద్యాలయం 13వ వార్షిక స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఈ సందర్భంగా రెవెన్షా బాలికల ఉన్నత పాఠశాలలో అభివృద్ధి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం మచ్చువా బజార్‌లోని సర్క్యూట్ హౌస్‌లో భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటారు. ఆ తరువాత తులసీ పూర్‌లోని ఆది కవి సరళ దాస్ విగ్రహానికి నివాళులర్పించి జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియానికి చేరుకుంటారు. అక్కడ ఆదికవి సరళ దాస్ 600వ జయంతిని పురస్కరించుకుని సరళ సాహిత్య సంసద్ నిర్వహించే కళింగ రత్న అవార్డు 2024 వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ కార్యక్రమం తర్వాత భువనేశ్వర్‌కు తిరిగి వచ్చి సాయంత్రం 5.30 గంటలకు ఢిల్లీకి బయలుదేరుతారు.

దివ్యాంగుడికి బతుకు బండి


ఆటో వద్ద భార్యతో హరిశ్చంద్ర


రాయగడ: జిల్లాలోని కళ్యాణసింగుపూర్ సమితి సునాఖండి గ్రామానికి చెందిన దివ్యాంగుడు హరిశ్చంద్ర ప్రస్కాకు జిల్లా యంత్రాంగం అండగా నిలిచింది. బతుకు బాటను కొనసాగించేందుకు బ్యాటరీతో నడిచే ఆటోను బుధవారం అందజేసింది. భార్య, ఇద్దరు పిల్లలను పోషించుకునేందుకు బంగారుబాటను చూపించినందుకు హరిశ్చంద్ర ఆనందం వ్యక్తం చేశారు. హరిశ్చంద్ర పుట్టుకతో దివ్యాంగుడు కాకపోయినా 2020లో జరిగిన ప్రమాదంలో కుడి కాలు కోల్పోవాల్సి వచ్చింది. అప్పటి నుంచి ఇంటి వద్దే చిన్న కిరాణా దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతని దీనావస్థను గుర్తించిన జిల్లా సామాజిక సురక్షా విభాగాధికారులు కలెక్టర్ ఫరూల్ పట్వారి దృష్టికి తీసుకువెళ్లారు. తక్షణమే స్పందించిన కలెక్టర్ జిల్లా యంత్రాంగం తరఫున ఆటో రిక్షా పంపిణీ చేశారు.

జయపురం పట్టణాభివృద్ధికి రూ.17 కోట్లు


కౌన్సిల్ అత్యవసర సమావేశంలో పాల్గొన్న చైర్మన్ మహంతి తదితరులు


జయపురం: జయపురం పట్టణ అభివృద్ధికి 2025–26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.17 కోట్లు కేటాయించారు. మంగళవారం మునిసిపాలిటీ కార్యాలయం కౌన్సిల్ సభా మందిరంలో నిర్వహించిన అత్యవసర కౌన్సిల్ సమావేశంలో ఈ విషయం వెల్లడించారు. మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి అధ్యక్షతన జరిగిన ప్రీ బడ్జెట్ సమావేశంలో 28 వార్డుల అభివృద్ధికి ఒక్కొక్క వార్డుకు రూ.45 లక్షలు చొప్పున కేటాయించినట్లు మునిసిపాలిటీ కార్యనిర్వాహక అధికారి, జయపురం సబ్ కలెక్టర్ కుమారి ఎ.శౌర్యారెడ్డి వెల్లడించారు. మార్చి 27న మరోసారి సమావేశం నిర్వహించి 2025–26 పూర్తి బడ్జెట్ కౌన్సిల్‌కు ముందుంచి చర్చించిన తరువాత ఆమోదిస్తామని చెప్పారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. కాగా, ఈ సమావేశానికి బీజేడీ కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. సమావేశంలో వైస్ చైర్ పర్సన్ బి.సునీత, అదనపు కార్యనిర్వాహక అధికారి కృతిబాస సాహు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆవుల చోరీ కేసులో ఆరుగురు అరెస్టు


పట్టుబడిన ఆవులు

మల్కన్‌గిరి: గంపకొండ పరిసర ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రెండు వాహనాల్లో చోరీ ఆవులను అక్రమంగా రవాణా చేస్తున్న ఆరుగురిని పోలీసులు పట్టుకున్నారు. వాహనాల నుంచి 55 ఆవులను స్వాధీనం చేసుకున్నట్లు ఐఐసీ చంద్రకాంత్ తండి తెలిపారు.

రూ. 34 లక్షలతో సుందరీకరణ పనులు


సుందరీకరణ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

జయపురం: జయపురం క్రిస్టియన్ సంప్రదాయ కబరపాదర్ సుందరీకరణ పనులను 34 లక్షల రూపాయల వ్యయంతో బుధవారం ప్రారంభించారు. స్థానిక క్రిస్టియన్ ప్రముఖులు రెవరెండం హిమాంశు శేఖర్ ముందుగా ఏసు ప్రభువుకి ప్రార్థన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. కబరపాదర్ సుందరీకరణ, ప్రహరీ నిర్మాణాలకు జయపురం మున్సిపాలిటీ రూ. 34 లక్షలు మంజూరు చేసింది. వీటిలో సుందరీకరణ పనులకు రూ. 17 లక్షలు, ప్రహరీ నిర్మాణానికి రూ. 17 లక్షలు ఖర్చు చేయనున్నారు. మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి, కార్యనిర్వాహక అధికారుల సహకారంతో నిధులు మంజూరైనట్లు క్రిస్టియన్ వర్గాలు తెలిపాయి. కార్యక్రమంలో ప్రార్థన సభ కోశాధిపతి మళయ చించాని, తాలూక్ సభ కోశాధి కారి అమన్ ఉజ్వాన్ నాయిక్, జయపురం క్రిస్టియన్ గ్రామ పంచాయతీ అధ్యక్షుడు సుదాంశు శేఖర సీతారాం, ఎం.జి.జ్యోతిర్మయి, సభ్యులు బును సాగర్, అనిల్ కచ్చప, మాజీ అధ్యక్షులు స చినా మహంతి, ప్రభాత్ బెన్య, కౌన్సిలర్ ప్రణభ కిశోర్ నాయిక్, అలబాన్ బిశాయి పాల్గొన్నారు.

ఏప్రిల్ 8 నుంచి మజ్జిగౌరి అమ్మవారి చైత్రోత్సవాలు


మజ్జిగౌరి అమ్మవారు

రాయగడ: ఆంధ్ర, ఒడిశా రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న రాయగడలోని చల్లనితల్లి మజ్జిగౌరి అమ్మవారి వార్షిక చైత్రోత్సవాలు ఏప్రిల్ ఎనిమిదో తేదీ నుంచి ప్రారంభమవుతాయి. ఐదురోజులు జరగనున్న ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు బుధవారం నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యుల సమావేశం నిర్ణయించింది. ఉత్సవాల్లో భాగంగా ఏడో తేదీ సాయంత్రం అమ్మవారి మందిరానికి సమీపంలోని జంఝావతి నదీ తీరం వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించిన అనంతరం శుద్ధమైన నదీ జలాలను కలశాలతో తీసుకువచ్చి అమ్మవారి మందిరంలో నిలపడం ద్వారా ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. గంజాం జిల్లా నుంచి ప్రతి ఏడాదిలా ఈసారి కూడా అమ్మవారి పూజలను నిర్వహించేందుకు అర్చకులను రప్పిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రాయిసింగి బిడిక తెలిపారు. అమ్మవారి చండీహోమం, సూర్యావాహన తదితర పూజలు జరుగుతాయి. 12వ తేదీన పూర్ణాహుతితో అమ్మవారి ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాల ఐదు రోజులు వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసేందుకు కమిటీ నిర్ణయించింది.

• ముగిసిన బోడ జాతర

జిల్లాలో నాలుగు రోజులుగా జరుగుతూన్న బోడ జాతర మంగళవారం రాత్రితో ముగిసింది. దేవతామూర్తులు తిరుగు ప్రయాణంగా పల్లకిలో బయలుదేరారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. – మల్కన్‌గిరి


ఊరేగింపులో పాల్గొన్న భక్తజనం


పూజలందుకుంటున్న అమ్మవారు

మలిశిరిపూర్‌లో నీటి ఎద్దడి


పాడైన గొట్టపుబావి

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ సమితి హటో మునిగుడ పరిధి మలిశిరిపూర్ గ్రామంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. తొమ్మిది నెలలుగా గ్రామంలోని సోలార్ విద్యుత్‌తో నడిచే గొట్టపుబావి మరమ్మతులకు గురవ్వడంతో మంచినీటి సమస్య తలెత్తింది. దీంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలో 120 కుటుంబాలకు చెందిన సుమారు 500 మంది జనాభా నివసిస్తోంది. గ్రామస్తుల తాగునీటి సౌకర్యార్థం జిల్లా యంత్రాంగం ఐదు గొట్టపుబావులు, రెండు సోలార్‌తో నడిచే గొట్టపు బావులను ఏర్పాటు చేసింది. అయితే వీటిలో రెండు గొట్టపు బావులు పూర్తిగా పాడవ్వగా.. సోలార్‌తో నడిచే గొట్టపు బావి కూడా పనిచేయడం లేదు. ఫలితంగా గ్రామస్తులు నీటి వెతలను ఎదుర్కొంటున్నారు. తొమ్మిది నెలలుగా వెంటాడుతున్న నీటి సమస్యను సంబంధిత శాఖ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదని గ్రామస్తులు అంటున్నారు. అధికారులు స్పందించి నీటి కష్టాలు తీర్చాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

• టికిరిలో రైతుల ఆందోళన


ధాన్యం బస్తాలను రోడ్డుపై ఉంచి ఆందోళన చేస్తున్న రైతులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి మండీల్లోని అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా రైతులు టికిరి ప్రధాన రహదారి వద్ద ధాన్యం బస్తాలను వేసి బుధవారం ఆందోళనకు దిగారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండీలకు విక్రయించేందుకు తీసుకువచ్చిన ధాన్యాన్ని రోజుల తరబడి ఉంచాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తీసుకువచ్చిన 15 వందల క్వింటాళ్ల ధాన్యానికి బదులు టికిరి ల్యాంప్ అధికారులు కేవలం ఆరు క్వింటాళ్లు కొనుగోలు చేయాలని లక్ష్యంగా తీసుకుని మిగతా వాటిని కొనుగోలు చేయకపోవడంతో మిగతా రైతులు తమ ధాన్యాన్ని ఎక్కడకు తీసుకువెళ్లి విక్రయించాలని ప్రశ్నించారు. తాము తీసుకువచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయకపోతే ఆందోళన విరమించేది లేదని పట్టుబట్టారు. రైతుల ఆందోళనకు బీజేడీ, కాంగ్రెస్ నాయకులు మద్దతుపలికారు.

శ్రీరామనవమి ఉత్సవాలకు శ్రీకారం


హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న సభ్యులు

భువనేశ్వర్: స్థానిక ఆంధ్ర సంస్కృతి సమితి (ఏసీఏ) ఈ ఏడాది శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో హనుమాన్ చాలీసా పారాయణంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టినట్లు సమితి కార్యదర్శి గన్నవరపు లక్ష్మణ రావు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 6 నుంచి 11 వరకు సమితి ప్రాంగణంలో శ్రీరామ నవమి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని చెప్పారు.

క్లుప్తంగా

బాధ్యతగా విధులు నిర్వహించండి

● జెడ్పీ ఛైర్‌పర్సన్ విజయ



ఉద్యోగులతో జెడ్పీ ఛైర్‌పర్సన్ విజయ తదితరులు

అరసవల్లి: జిల్లా పరిషత్ యాజమాన్యంలో కారుణ్య నియామకాలను పూర్తి పారదర్శకంగా చేపడుతున్నామని, ఉద్యోగాలు పొందినవారు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ సూచించారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బంగ్లాలో కారుణ్య నియామకాల కింద పాలక దమయంతి (సరుబుజ్జిలి ఎంపీపీ ఆఫీస్ సబార్డినేట్), మక్క అప్పలనాయుడు (జెడ్పీ ఆఫీస్ సబార్డినేట్), లండ కోటేశ్వరరావు (కొలిగాం జెడ్పీ స్కూల్ ఆఫీస్ సబార్డినేట్) లకు నియామకపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా, సీ సెక్షన్ సూపరింటెండెంట్ రమేష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ఘటనా స్థలంలో మధు మృతదేహం

పాతపట్నం: మండలంలోని ద్వారాకాపురం వద్ద పాతపట్నం-టెక్కలి రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని లాబర గ్రామానికి చెందిన సనపల మధు(22) బుధవారం సాయంత్రం సారవకోట మండలం కరడసింగి గ్రామంలోని తన చెల్లెలు ఇంటికి వెళ్లాడు. అనంతరం తన బావ మండల శివ, మేనల్లుడు (రెండు సంవత్సరాల)తో కలిసి ద్విచక్ర వాహనంపై లాబర బయల్దేరారు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై సారవకోట మండలం జమచక్రంకు చెందిన పంతులు గోపి వస్తున్నాడు. ద్వారకాపురం వద్ద ఈ రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. ఘటనలో సనపల మధు అక్కడికక్కడే మృతి చెందగా, పంతులు గోపి, మండల శివకు తీవ్రగాయాలయ్యాయి. రెండేళ్ల బాబుకి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి ఎస్ఐ బి.లావణ్య చేరుకున్నారు. గోపిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి అంబులెన్స్‌లో, మండల శివ, బాలుడిని పాతపట్నం సీహెచ్‌సీకి ఎస్ఐ జీపులో తరలించారు. మృతుడు మధుకి తండ్రి సనపల కృష్ణారావు, తల్లి సనపల సావిత్రిలు ఉన్నారు. వచ్చే నెల ఏప్రిల్ 16న పెళ్లి చేయాలని ముహూర్తం పెట్టుకున్నామని విలపిస్తున్నారు.

లిఫ్ట్ ఇచ్చి దారి దోపిడి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కోసంగిపురం జాతీయ రహదారి కూడలి వద్ద మంగళవారం సాయంత్రం దారి దోపిడి జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. పలాస కిడ్నీ ఆస్పత్రిలో దుంపల అప్పన్న వైద్య సేవలు పొందుతున్నాడు. అతడిని చూసేందుకు భార్య యశోద వచ్చింది. ఆయనకు ఆహారం అన్నీ సమకూర్చి ఇంటికి బయల్దేరగా గుర్తు తెలియని వ్యక్తి స్కూటీపై వచ్చి లిఫ్ట్ ఇచ్చాడు. కోసంగిపురం శివాలయం పక్కన నిర్మానుష్య తోటలు వచ్చేసరికి, తోటలోకి ఆమెను తీసుకెళ్లి కత్తితో భయపెట్టి బంగారు పుస్తెల తాడు (రెండున్నర తులాలు) దోచుకున్నాడు. అనంతరం దుండగుడు అక్కడ నుంచి పారిపోయాడు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

నందిగాం: మండలంలోని సుభద్రాపురం గ్రామానికి చెందిన టొంప తులసమ్మ(50) బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తులసమ్మ భర్త 20 ఏళ్ల క్రితం మృతి చెందాడు. వాళ్లకు ఒక కుమార్తె పార్వతి ఉంది. పార్వతికి వివాహం చేయగా, ఒక కుమారుడు పుట్టాక భర్త ఆమెను విడిచిపెట్టడంతో తల్లి వద్దనే ఉంటోంది. దీంతో తల్లీకూతుళ్లు ఇద్దరూ కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తుండేవారు. అయితే తులసమ్మ ఇటీవల మతి స్థితిమితం కోల్పోయి ప్రవర్తించేది. కుమార్తె కూలీ పనికి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న తులసమ్మ వాటర్ ప్యాకెట్ అనుకొని పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకొని అనంతరం మృతి చెందింది. పడిపోయి ఉన్న తులసమ్మను చూసినవారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని టెక్కలి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మనుమడు కుజ్జ జానకిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రణస్థలంలో...

రణస్థలం: మండలంలోని సంచాం గ్రామానికి చెందిన పప్పల రమణ(35) పురుగుల మందు తాగి మృతి చెందినట్లు జేఆర్‌పురం ఎస్ఐ చిరంజీవి తెలిపారు. పొలంలో షెడ్ వేసే విషయంలో ఇంట్లో తల్లి, భార్యతో గొడవపడి మనస్థాపానికి గురై బుధవారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. భార్య వెంటనే గమనించి రణస్థలం సీహెచ్‌సీకి తీసుకెళ్లింది. అక్కడ నుంచి వైద్యులు మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేయగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య పప్పల పెంటమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు

- జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్‌ను అవమానపరచడం తగదు
- బీజేపీ ఎమ్మెల్యే జయనారాయణ మిశ్రా తీరుపై మండిపాటు



కొరాపుట్: పార్లమెంట్‌లో మాట్లాడుతున్న కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క



జయపురం: జయనారాయణ దిష్టిబొమ్మను తగులబెట్టిన కాంగ్రెస్ శ్రేణులు

జయపురం: రాష్ట్ర విధాన సభా మందిరంలో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి షర్ట్ కాలర్ పట్టుకొని బీజేపీ ఎమ్మెల్యే జయనారాయణ మిశ్రా అవమానపరచారంటూ జయపురం కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. మంగళవారం సాయంత్రం కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శిభూషణ పాత్రో నేతృత్వంలో వందలాది మంది కార్యకర్తలు బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేపీ పాలనలో శాంతిభద్రతలు క్షీణించాయని మండిపడ్డారు. ప్రజాప్రతినిధుల గొంతు నొక్కుతున్నారని నినాదాలు చేశారు. అనంతరం జయనారాయణ మిశ్రా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పాత్రో మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హత్యలు, అత్యాచారాలు పెరిగాయని, వాటిపై బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీసిన తారాప్రసాద్‌ను జయనారాయణ అవమానించారని మండిపడ్డారు. జయనారాయణను తక్షణం సభ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో జయపురం మున్సిపల్ ఛైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, జిల్లా కాంగ్రెస్ కోశాధ్యక్షుడు నిహారంజన్ బిశాయి, సీనియర్ నేత బినోద్ మహాపాత్రో, జయపురం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బసంత నాయిక్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుకాంత పట్నాయిక్, దేవేంద్ర బాహిణీపతి, చిన్నారావు, బొరిగుమ్మ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్ గంతాయిత్, కాంత పాఢీ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ధ్వజమెత్తిన కొరాపుట్ ఎంపీ..

కొరాపుట్: కాంగ్రెస్ పార్టీకి చెందిన కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్క పార్లమెంట్‌లో ధ్వజమెత్తారు. బుధవారం ఆయన పార్లమెంట్‌లో మాట్లాడుతూ ఒడిశా అసెంబ్లీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన జయపూర్ ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతిపై దాడి చేయడం సిగ్గు చేటన్నారు. ఒడిశా గౌరవం అంటూ ప్రకటనలు చేసే బీజేపీకి ఇది సిగ్గుగా అనిపించలేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పడిన తర్వాత 54 మంది మహిళలపై అత్యాచారాలు జరిగాయని చెప్పారు. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మజ్జి ప్రాతినిధ్యం వహిస్తున్న సొంత నియోజకవర్గంలోనూ అత్యాచారం జరిగిందని గుర్తు చేశారు. వీటిపై ప్రశ్నించిన సభ్యులపై దాడులు చేయడం సరికాదన్నారు. మరో వైపు కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనకు దిగాయి.

కాంగ్రెస్ సభ్యుల బైఠాయింపు

భువనేశ్వర్: అధికార పక్షం బీజేపీ, కాంగ్రెస్ సభ్యుల మధ్య శాసనసభలో వాగ్వాదం చోటుచేసుకుంది. కాంగ్రెస్ సభ్యుడు తారా ప్రసాద్ బాహినీపతిని స్పీకర్ సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇది ఏకపక్షమంటూ కాంగ్రెస్ సభ్యుడు నిరసనకు దిగారు. ఆయనతో తోటి సభ్యులు ముందడుగు వేశారు. శాసనసభ ఆవరణలో గాంధీ బొమ్మ దగ్గర కాంగ్రెస్ సభ్యులు బైఠాయించారు. స్పీకర్ చర్యని ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ కూడా తప్పు బట్టింది. పరిస్థితి చక్కదిద్దాల్సిన విపత్కర పరిస్థితుల్లో ముఖ్యమంత్రి గైర్హాజరుని విపక్షం ఎండగట్టింది. ఇంతలో ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ సంప్రదింపులతో కాంగ్రెస్ సభ్యులు నిరసన విరమించుకున్నారు. అయితే బుధవారం నాటి సభా కార్యక్రమాలను సామూహికంగా బహిష్కరించారు.

అధికార పక్షం బుజ్జగింపు

ఈ పరిస్థితిని సవరించే దిశలో అధికార పక్షం భారతీయ జనతా పార్టీ సభ్యులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు. సభకు దూరమైన కాంగ్రెస్ సభ్యులు హాజరు కావాలి అని బుజ్జగింపు ప్రారంభించారు. ప్రభుత్వ చీఫ్ విప్ సరోజ్ ప్రధాన్‌తో మంత్రి సూరజ్ సూర్యవంశీ చర్చలు జరిపారు. కాగా సస్పెండైన కాంగ్రెస్ సభ్యుడు తారా ప్రసాద్ బాహినీపతికి ప్రధాన విపక్షం బిజూ జనతా దళ్ మద్దతుగా నిలిచింది. స్పీకర్ జారీ చేసిన సస్పెన్‌ను ఉపసంహరించుకోవాలని స్పీకర్ సురమా పాఢితో సమావేశమై విజ్ఞప్తి చేశారు.



జయపురం: నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



జయపురం:ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కొరాపుట్: నబరంగ్‌పూర్‌లో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు



కొరాపుట్: కొరాపుట్‌లో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడ సమితి మహుళి గ్రామ పంచాయతీ పారల ఉన్నత ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు గుప్త మహానందపై ఆ గ్రామ ప్రజలు బుధవారం బొయిపరిగుడ బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడు గుప్త మహానంద పాఠశాలను తన సొంత ఇంటిగా వినియోగించుకుంటున్నారని ఆరోపించారు. మధ్యాహ్న భోజన పథకం నిధులు స్వాహా చేస్తున్నాడని ఆరోపించారు. విద్యార్థులకు చదువు చెప్పటం లేదన్నారు. పాఠశాలలోనే బట్టల దుకాణం పెట్టి వ్యాపారం చేస్తున్నాడని ఆరోపించారు. టాటా మ్యాజిక్ వాహనం పాఠశాల ఆవరణలో పెట్టి అద్దెకు తిప్పుతున్నాడన్నారు. గ్రామస్తుల ఆరోపణలపై దర్యాప్తు చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని బీఈఓ సుకాంత కొర్తామీ వెల్లడించారు.



ఉపాధ్యాయుడిపై బీఈఓకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

బీఈఓ కార్యాలయం ముట్టడి



బీఈఓ కార్యాలయాన్ని ముట్టడించిన గ్రామస్తులు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్ర సమితి లిమ్మ గ్రామ పంచాయతీ కుసుమగుడ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుని బదిలీ చేసినందుకు నిరసనగా మంగళవారం ఆ గ్రామస్తులు కుంద్ర బ్లాక్ ఎడ్యుకేషన్ అధికారి (బీఈఓ) కార్యాలయాన్ని ముట్టడించారు. పాఠశాల పరిచాలన కమిటీ సభ్యులు, సర్పంచ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. బీఈఓ తన కార్యాలయంలో లేకపోవటంతో వినతి పత్రాన్ని కార్యాలయంలో ఒక ఉద్యోగికి అందజేశారు. కుసుమగుడ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో 8వ తరగతి వరకు 127 మంది విద్యార్థులు చదువుతున్నారని గ్రామస్తులు తెలిపారు. అయితే పాఠశాలలో కేవలం 5 గురు ఉపాధ్యాయులు ఉన్నారని వెల్లడించారు. ఒక ఉపాధ్యాయుడిని బదిలీ చేశారన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయుడు గోవింద ప్రదాన్ పాఠశాలలో లెక్కలు, సైన్స్ సబ్జెక్టులు బోధించేవారన్నారు. ఆయన బదిలీ కావటంతొ ఆ రెండు సబ్జెక్టులు బోధించే మరో ఉపాధ్యాయుడు లేడన్నారు. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాన్ని పంపించామన్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు త్రినాథ్ జాని, సభ్యులు తులమని మొసిహ, భగవాన్ ఖుడిపియ, గౌరీశంకర పొరజ, రీణ పంగి, లక్ష్మణ ఖుడిపియ, సురేష్ బారిక్, శ్రీధర పొరజ, ప్రతిమ జానీ, గుప్త బారిక్, తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు



పాతపట్నం: రికార్డులు పరిశీలిస్తున్న ఫుడ్ కమిషన్ సభ్యుడు కాంతారావు

పాతపట్నం: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు బి.కాంతారావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని రేషన్ డిపోలు, మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు(ఎండీయూఎస్), బూరగాంలోని రేషన్ షాపు, అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు పాతపట్నం ఆల్ ఆంధ్ర రోడ్డులోని ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు పెట్టే భోజనం సరిగా లేకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులు సక్రమంగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్, సీడీపీవో టి.విమలారాణి, ఏఎస్‌డబ్ల్యూవో ఎం.శ్యామల, ఎస్ఎస్ఏ జీసీడీవో ఎస్.నీరజ, ఎంఈవో-2 సీహెచ్ తిరుమలరావు, సీఎస్‌డీటీలు ప్రసాదరావు, చక్రవర్తిలు, ఆర్ఐ బాబి, ఎండీయూ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రైతు సూర్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అనూరాధ, ఉషారాణి తదితరులు ఉన్నారు.

మెళియాపుట్టి: విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ కమిటీ సభ్యుడు బి.కాంతారావు సూచించారు. మండలంలోని కేజీబీవీ, చాపర ఎస్సీ హాస్టల్, ఎఫ్‌సీఐ గోడౌన్‌లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. చాపర ఎస్సీ వసతి గృహంలో రికార్డులు, నిల్వ ఉన్న సామగ్రిలో తేడాలున్నట్లు గుర్తించారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసి, వార్డెన్‌కు మెమో జారీ చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు తహసీల్దార్ పాపారావు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సిబ్బందిపై టీడీపీ నేత దాడి

అరసవల్లి: విద్యుత్ బిల్లు చెల్లించమని అడిగినందుకు సిబ్బందిపై పెద్దపాడుకు చెందిన టీడీపీ నేత దాడికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. డీ-2 బలగ సెక్షన్ పరిధిలోని పెద్దపాడు పరిసరాల్లో టీడీపీ నేత కలగ శ్రీనివాసరావుకు చెందిన నాలుగు విద్యుత్ సర్వీసులకు సంబంధించి, గత నవంబర్ నుంచి సుమారుగా రూ.15 వేల వరకు విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో డీ-లిస్టులో ఉన్న ఈ సర్వీసుల నిలుపుదల చేసేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అయితే ముందుగా వినియోగదారుడికి సమాచారం ఇవ్వడానికి సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ వి.నారాయణరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ జి.మల్లిబాబు, లైన్‌మెన్ ఎం.భాస్కరరావు, జేఎల్ఎంలు కె.చలపతిరావు, జి.హరికృష్ణల బృందం, తంగివానిపేట రోడ్డులో ఒక నిర్మాణం వద్దనున్న కలగ శ్రీనివాసరావును కలిసి పరిస్థితిని వివరించారు. దీంతో ఆయన ఆగ్రహించి సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ నారాయణరావుకు చెంపదెబ్బ కొట్టాడని సిబ్బంది పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. దీనిపై విద్యుత్ సిబ్బంది స్పందించి కలగ శ్రీనివాసరావుపై పోలీసులు చర్యలు తీసుకోకపోతే నిరసనకు దిగుతామని హెచ్చరించారు.

కాంగ్రెస్ నిరసన విరమణ

భువనేశ్వర్: అధికార పార్టీకి వ్యతిరేకంగా నిరసనలు చెలరేగాయి. స్పీకర్.. ప్రతిపక్ష పార్టీ సభ్యులపై మాత్రమే చర్య తీసుకున్నారు. తారాప్రసాద్ బాహినీపతిని అసెంబ్లీ నుంచి 7 రోజుల పాటు సస్పెండ్ చేశారు. స్పీకర్ సురమా పాఢి తారా ప్రసాద్ బాహినీపతిని సస్పెండ్ చేశారు. ఈ చర్యని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్, బీజేడీ సభలో నిరసన తెలిపాయి. స్పీకర్ నిర్ణయం ఏకపక్షంగా ఉందని బాధిత ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతి అన్నారు. ఏ నియమం ప్రకారం తనను సస్పెండ్ చేశారని స్పీకర్‌ను నిలదీశారు. స్పీకర్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదని పీసీసీ చీఫ్ భక్త చరణ్ దాస్ అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 44,000 మంది మహిళలు తప్పిపోయారు. పాఠశాలల్లో బాలికలు గర్భవతులు అవుతున్నారు. ప్రభుత్వం ఈ చర్యల పట్ల సిగ్గుపడాలి. సభా కమిటీ ఏర్పాటు చేసి ఉంటే, మహిళలపై హింసకు సంబంధించిన ప్రతి విషయాన్ని పరిష్కరించే వారని తారా ప్రసాద్ బాహినీపతి అన్నారు. ప్రదేశ్ కాంగ్రెసు కమిటీ అధ్యక్షుని సంప్రదింపులతో రాత్రింబవళ్ల నిరసన ప్రదర్శనను కాంగ్రెస్ సభ్యులు విరమించుకున్నారు. మరో వైపు వీరంతా బుధవారం సభను బహిష్కరించారు.

బిజూ విగ్రహావిష్కరణ ఎప్పుడు?



ప్లకార్డులతో బీజేడీ కౌన్సిలర్లు విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు

జయపురం: బిజూ పట్నాయక్ విగ్రహాన్ని ఎప్పుడు ఆవిష్కరిస్తారని జయపురం మున్సిపల్ అధికారులను బీజేడీ కౌన్సిలర్లు ప్రశ్నించారు.మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు విష్ణువర్ధన్ రెడ్డి, కుమార్ బెహరా, పార్థ సారథి మల్లిక్ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. బిజూ పట్నాయక్ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు స్థలం లేక పోయిందా అని ప్రశ్నించారు.

రాజగోపాలరావు సేవలు చిరస్మరణీయం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కళింగ జాతి అభివృద్ధికి బొడ్డేపల్లి రాజగోపాలరావు చేసిన సేవలు చిరస్మరణీయమని కళింగ కుల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ దుంపల లక్ష్మణరావు అన్నారు. బుధవారం బొడ్డేపల్లి రాజగోపాలరావు 102వ జయంతి సందర్భంగా శ్రీకాకుళం పట్టణంలోని సింహద్వారం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట సత్యనారాయణ, పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్, చింతాడ ప్రసాద్, పైడి నాగభూషణ్, సీపాన రామారావు పాల్గొన్నారు.

27న శాసన సభ ముట్టడి



అత్యవసర సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ ప్రముఖులు

- కాంగ్రెస్ నిర్ణయం

భువనేశ్వర్: శాసన సభ నుంచి ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహినీపతి సస్పెన్షన్ అంశంపై రాష్ట్ర కాంగ్రెస్ అత్యవసర అంశంగా చర్చించింది. ఈ నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ అధ్యక్షతన బుధవారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వీరి సమక్షంలో భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేశారు. అత్యవసర సమావేశం తీర్మానం ప్రకారం ఈ నెల 27వ తేదీన శాసన సభను ముట్టడించనున్నారు. సభలో కాంగ్రెస్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బహినీపతిపై దాడి, రాష్ట్రంలో శాంతిభద్రతల విఘాతం అత్యంత ప్రమాదకర పరిస్థితులుగా పరిగణించినట్లు మీడియాకు వివరించారు. అత్యవసర సమావేశం తర్వాత పీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి సంయుక్తంగా మీడియాతో స్పందించారు. క్షీణిస్తున్న శాంతిభద్రతలకు వ్యతిరేకంగా, మహిళల భద్రత కోసం నిరసన తెలపడానికి కాంగ్రెస్ అసెంబ్లీ ముట్టడికి నిర్ణయించినట్లు పేర్కొన్నారు. బీజేపీ ప్రభుత్వం పాలన ఎనిమిది నెలల కాలంలో మహిళలపై హింస పెరిగిందని, 18,000 మంది మహిళలు అత్యాచారానికి గురయ్యారన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి స్పందనను కాంగ్రెస్ కోరింది. కానీ స్పందించడానికి బదులుగా మంగళవారం అసెంబ్లీలో ప్రజాస్వామ్యంలోని ఒక చీకటి అధ్యాయం మోహన్ చరణ్ మాఝి ప్రభుత్వం ఆవిష్కరించిందని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని నిలువునా హత్య చేశారని ఆరోపించారు. దీనికి సంబంధించి కాంగ్రెస్ సమావేశంలో ఒక అభిశంసన తీర్మానం ఆమోదించిందని ప్రకటించారు.



మీడియాతో మాట్లాడున్న పీసీసీ చీఫ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి

భార్యే హంతకురాలు

- వీడిన జగదీష్ హత్య కేసు మిస్టరీ
- నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జితేంద్ర పండా

పర్లాకిమిడి: స్థానిక నగరంపల్లి వీధిలోని నటరాజ్ సినిమా థియేటర్ సమీపంలో ఈ నెల 10న జగదీష్ పలక(26) అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. మృతుడి భార్య ఉరిసినీ రైతో అలియాస్ హారియే నిందితురాలిగా గుర్తించి రాయగడ జిల్లా గుణుపురం సమీపంలోని అంజర్ బాసింగి గ్రామంలో అరెస్టు చేశారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో (రాణిపేట) ఎస్పీ జితేంద్ర పండా విలేకరులకు వివరాలు వెల్లడించారు. గుణుపురంలో బొలేరో డ్రైవరుగా పనిచేస్తున్న జగదీష్ మెలక రాయగడ జిల్లా అంజర్‌బాసింగి గ్రామానికి చెందిన ఉరిసినీ రైతోను 2024లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఉరిసినీ తనకు పర్లాకిమిడిలో ఉద్యోగం వస్తుందని నమ్మబలికి పర్లాకిమిడిలో కాపురం పెట్టించింది. వీరిద్దరూ నగరంపల్లి వీధిలో చిన్మయగౌడ ఇంటిలో అద్దెకు ఉండేవారు. నెలలు గడుస్తున్నా ఉద్యోగం రాకపోవడంతో ఇద్దరి మధ్య కలహాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో మార్చి 6న జగదీష్‌ను భార్య కత్తితో పొడిచి పారిపోయింది. అనంతరం మృతుడి తల్లి మెలక అనసూయ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు ఉరిసినీని అరెస్టుచేశారు. ఆమె వద్ద నుంచి కత్తి, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిని కోర్టులో హాజరుపరిచారు. విలేకరుల సమావేశంలో సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్, ఐఐసీ ప్రశాంత్ భూపతి తదితరులు పాల్గొన్నారు.

భారీగా గంజాయి స్వాధీనం



ఇచ్ఛాపురం టౌన్: పోలీసుల అదుపులో నిందితులు



నరసన్నపేట: వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు

నరసన్నపేట: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సుబలై గ్రామానికి చెందిన తుఫాన్ కరియా అనే వ్యక్తిని నరసన్నపేట పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 24 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు. తుఫాన్ కరియా ఒడిశాలో గంజాయి కొనుగోలు చేసి గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌లో రితీష్ అనే వ్యక్తికి ఇచ్చేందుకు తీసుకెళ్తున్నాడు. దీనికి సంబంధించి ముందస్తు సమాచారంతో మడపాం టోల్‌గేట్ వద్ద నరసన్నపేట ఎస్ఐ దుర్గాప్రసాద్ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో తుఫాన్ కరియా ఒక వాహనంలో నుంచి దిగిపారిపోతుండగా వెంబడించి పట్టుకొని కేసు నమోదు చేశారు. బరంపురం నుంచి ఈ గంజాయిని తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

ఇచ్ఛాపురం టౌన్: ఒడిశా నుంచి సూరత్‌కు 10.31 కిలోల గంజాయి తరలిస్తున్న ఒడిశా రాష్ట్రం ముమిదిహ గ్రామానికి చెందిన బురగాన సింహాచల పాత్రో, సంజయ బెహరాలను అరెస్ట్ చేసినట్లు కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు తెలిపారు. వీరిద్దరూ సూరత్‌లో పనిచేస్తూ జీవిస్తున్నారు. వారికి అక్కడ గంజాయి వ్యాపారం చేసే గొల్ల అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. అతను తనకు గంజాయి అందిస్తే కిలోకు రూ.9 వేలు ఇస్తానని చెప్పడంతో ఒడిశా రాష్ట్రంలోని కొద్ద గ్రామానికి చెందిన వ్యక్తి వద్ద కొనుగోలు చేశారు. గంజాయిని ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్తుండగా పట్టణ పోలీసులు తనిఖీలు చేసి పట్టుకున్నారు. సమావేశంలో సీఐ చిన్నమనాయుడు, ఎస్ఐ ముకుందరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా వైభవ్ జ్యూయలర్స్ ప్రారంభం



వైభవ్ జ్యూయలర్స్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్

సాలూరు: పట్టణంలో వైభవ్ జ్యూయలరీ షోరూమ్‌ను బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ మాధవ రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్‌లు హాజరై షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సాలూరు పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ జ్యూయలర్స్ షోరూమ్‌ను అందుబాటులోకి తీసుకురావడం శుభపరిణామమన్నారు. సంస్థ అసిస్టెంట్ వైస్‌ప్రెసిడెంట్ రఘునాథ్ మాట్లాడుతూ వినియోగదారులకు అద్భుత శ్రేణి షాపింగ్ అనుభవంతో పాటు విస్తృత శ్రేణిలో 916 హాల్‌మార్క్‌డ్ బంగారు ఆభరణాలు, సర్టిఫైడ్ డైమండ్స్ తదితర ఆభరణాలు అందించాలనే ఉద్దేశంతో ఈ షోరూమ్‌ను సాలూరులో ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో వైభవ్ సంస్థల సీఎండీ గ్రంధి భారత మల్లికా రత్నకుమారి, సీఈఓ గొంట్ల రాఖాల్ తదితరులు పాల్గొన్నారు.

డీసీహెచ్‌ఎస్‌లో ఖాళీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫోర్ట్: జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి (డీసీహెచ్‌ఎస్) పరిధిలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జీవీ రాజ్యలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఈ ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను 21వతేదీ సాయంత్రం 5 గంటల లోగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఉన్న డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని కోరారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పార్వతీపురం రూరల్: అమ్మాయిని మోసం చేసిన కేసులో పార్వతీపురం మండలం జమదాల గ్రామానికి చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశామని పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి బుధవారం తెలిపారు. అదే గ్రామానికి చెందిన బాధితురాలు పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: శ్రీ విశ్వావసు నామ తెలుగు సంవత్సరం ఉగాది 2025 పండగ పర్వదిన శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఉమ్మడి విజయనగరం జిల్లాలోని మారుమూల పల్లెలు, పట్టణాల్లో మట్టిలో మాణిక్యాల్లా దాగి ఉన్న కవులు, కళాకారుల, రచయితలు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు, వైద్యులు, సమాజ సేవకులు, ఆధ్యాత్మిక, యోగా గురువులు, కార్మికులు, కర్షకులు, క్రీడాకారుల ప్రతిభను సేవలను గుర్తించి వారికి 'శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది- 2025 పురస్కారాన్ని' ఇచ్చి ఘనంగా సన్మానించి సత్కరించనున్నట్లు 'ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ' (సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ డైరెక్టర్ ఈఎస్ఎస్ నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాజసేవ, పర్యావరణ పరిరక్షణ, వృద్ధులు, దివ్యాంగులు, విద్య, వైద్యం, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, కరాటే, ఆధ్యాత్మికం, వ్యవసాయం, ఉపాధి కల్పన, నాటకరంగం, టీవీ సినీరంగాల్లో సేవలందిస్తున్న వారు, ప్రతిభావంతులు, పురస్కారాల ఎంపిక కోసం వారి సేవలను, ప్రతిభను, గురించి తెలియచేసే వివరాలు పంపించాలని కోరారు. వివరాలకు ఫోన్ 9652347207నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆటో నుంచి జారిపడి ఆరోగ్యమిత్ర మృతి

బొబ్బిలి రూరల్: మండలంలోని పక్కి గ్రామానికి చెందిన సీర గౌరినాయుడు(58) ప్రమాదవశాత్తు ఆటో నుంచి జారిపడి మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బొబ్బిలి సీహెచ్‌సీలో ఆరోగ్యమిత్రగా పనిచేస్తున్న గౌరినాయుడు మంగళవారం విధులు ముగించుకుని స్వగ్రామానికి ఆటోలో వెళ్తుండగా పక్కి గ్రామసమీపంలో ఆటోలోంచి జారిపడడంతో తలకు తీవ్రగాయమైంది. స్థానికులు సీహెచ్‌సీకి తరలించగా ప్రాథమిక చికిత్సను అందించిన అనంతరం మెరుగైన చికిత్సకోసం విశాఖలో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య సరస్వతితో పాటు 10ఏళ్ల బాలుడు,4ఏళ్ల పాప ఉన్నారు. సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పోలమాంబ ఏడవ జాతర ఆదాయం రూ.3,07,650

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఏడవ వారం జాతర ఆదాయాన్ని ఈవో వీవీ.సూర్యనారాయణ సమక్షంలో బుధవారం లెక్కించారు. ఏడవ జాతరలో మొత్తం రూ.3,07,650 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలిపారు.

కిడ్నీల పట్ల శ్రద్ధ చూపాలి

- నొప్పి మాత్రలు ఎక్కువగా వాడడం వల్ల కిడ్నీ సమస్యలు
- నెలకు 1200 నుంచి 1500 వరకు కేసుల నమోదు

విజయనగరం ఫోర్ట్: మానవ శరీరంలో కిడ్నీలు అతి ముఖ్యమైనవి. కిడ్నీ సమస్యలపై అశ్రద్ధ చేస్తే మృత్యువాతపడే ప్రమాదం ఉంది. కిడ్నీల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి. కిడ్నీ సమస్యలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. కిడ్నీ సమస్యలు తలెత్తిన వెంటనే చికిత్స చేయించుకుంటే సురక్షితంగా జీవించవచ్చు. ప్రతి10 మందిలో ఒకరు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నట్లు పలు అధ్యయనాల్లో తేలింది. గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం. అధిక రక్తపోటు, మధుమేహం, స్థూలకాయం, అంటు వ్యాధులు, మాదక ద్రవ్యాల వినియోగం మూత్ర పిండాల వ్యాధికి ప్రధాన కారణం. నొప్పి మాత్రలు అధికంగా వాడడం, కిడ్నీలో రాళ్లు పెరగడం వల్ల కూడా కిడ్నీ సమస్యలు వచ్చే ఆస్కారం ఉంది.

కిడ్నీ వ్యాధి వల్ల కలిగే సమస్యలు

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు గుండెపోటు, స్ట్రోక్, అధిక రక్తపోటు, బలహీనమైన ఎముకలు, గుండె వ్యాధి, కిడ్నీ వైఫల్యం(చివరి దశ మూత్ర పిండ వ్యాధి) సమస్యలు వస్తాయి. పింక్, డార్క్ మూత్రం(మూత్రంలో రక్తం) కష్టమైన బాధాకరమైన మూత్రవిసర్జన, అధిక మూత్ర విసర్జన, దాహం పెరగడం అలసట, బలహీనత, ఉబ్బిన చేతులు, ముఖం, పాదాలు, నురుగుమూత్రం కిడ్నీ వ్యాధి లక్షణాలు.



ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకున్న కిడ్నీవ్యాధిగ్రస్తులు

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

ఆరోగ్యకరమైన జీవన శైలి నిర్వహించడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు. క్రమం తప్పకుండా వ్యాయమం చేయాలి. బరువును నియంత్రించుకుని, సమతుల్య ఆహారం తీసుకోవాలి. ధూమపానానికి దూరంగా ఉండాలి. కొలెస్ట్రాల్ స్థాయిలను పర్యవేక్షించుకోవడం, వార్షిక శారీరక ఆరోగ్య పరీక్షలు చేయంచుకోవాలి. అధిక రక్తపోటు, మధుమేహం ఉన్నవారు వాటిని అదుపులో ఉంచుకోవాలి. మూత్ర పిండ వ్యాధిని గుర్తించడానికి స్క్రీనింగ్ చేయించుకోవాలి.

నెలకు 1200 నుంచి 1500 వరకు రోగుల నమోదు

జిల్లాలో కిడ్నీ సంబంధిత వ్యాధులతో నెలకు వందలాది మంది ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వస్తున్నారు. నెలకు 1200 నుంచి 1500 మంది వరకు రోగులు ఆస్పత్రుల్లో నమోదవుతున్నారు. కిడ్నీలు పాడై డయాలసిస్ చేయించుకున్న రోగులు 400 నుంచి 500 మంది వరకు ఉన్నారు. కిడ్నీ సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల కిడ్నీ వ్యాధి గ్రస్తుల సంఖ్య బాగా పెరుగుతోంది. వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించలేక పోవడం వల్ల వారు డయాలసిస్ చేయించుకోవాల్సిన పరిస్థితికి వస్తున్నారు.



కిడ్నీ సమస్యతో వచ్చిన వ్యక్తిని పరీక్షిస్తున్న వైద్యుడు

బీపీ, సుగర్ అదుపులో ఉంచుకోవాలి



కిడ్నీ సమస్యలను ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధితీవ్రతను తగ్గించవచ్చు. బీపీ, సుగర్ వంటి వ్యాధులను అదుపులో ఉంచుకోవాలి. శారీరక శ్రమ ఉండేందుకు ప్రతిరోజూ వ్యాయమం చేయాలి. సమతుల్య ఆహారాన్ని తీసుకోవాలి. శరీరంలో కొవ్వు పరిస్థితిని ఆరోగ్య పరీక్షల ద్వారా తెలుసుకోవాలి. కిడ్నీలో రాళ్లు పెరగకుండా చూసుకోవాలి. నొప్పి మాత్రలు అధికంగా వాడడం వల్ల కూడా కిడ్నీ సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

డాక్టర్ రెడ్డి శివకుమార్, నెఫ్రాలజిస్టు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

సారా రహిత జిల్లాయే లక్ష్యం

- ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 14405
- కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్

విజయనగరం గంటస్తంభం: సారా రహిత జిల్లాగా మార్చేందుకు కృషి చేయలని అధికారులను కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆదేశించారు. సారాకు సంబంధించిన ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 14405కు విస్తత ప్రచారం కల్పించాలని సూచించారు. ఏపీ ప్రభుత్వ ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నవోదయం 2.0 కార్యక్రమం అమలులో భాగంగా కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సారా నిర్మూలన సమన్వయ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తమ గ్రామంలో ఎక్కడా సారా తయారీ గానీ, వినియోగం గానీ జరగడం లేదని అన్ని గ్రామాల్లో పంచాయితీ తీర్మానాలను తీసుకోవలని సూచించారు. వారం రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేసిన తరువాత, అప్పటికీ సారా తయారీ, వినియోగం జరుగుతున్నట్లు గుర్తించిన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, అదుపు చేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అబ్కారీ శాఖతో పాటు పోలీసులు, అటవీశాఖ కూడా సారా తయారీపై నిఘా పెంచాలని కోరారు. అటవీ ప్రాంతంలో ఎక్కడైనా సారా తయారీ జరిగితే, దానికి అటవీశాఖదే బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లాను సారా రహితంగా మార్చడంలో అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కోరారు. నవోదయం 2.0 కు సంబంధించిన వాల్‌పోస్టర్, స్టిక్కర్లు, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించి ప్రచార రథాన్ని ప్రారంభించారు. సమావేశంలో ఇన్‌చార్జ్ జేసీ ఎస్.శ్రీనివసమూర్తి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు, అటవీశాఖాధికారి కొండలరావు, డీఈఓ మాణిక్యంనాయుడు, డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.జీవనరాణి, డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాసరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



నవోదయం 2.0కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్, వివిధ శాఖల అధికారులు

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

విజయనగరం: జాతీయస్థాయిలో జరగనున్న ఫెన్సింగ్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి అర్హత సాధించిన క్రీడాకారులు బుధవారం పయనమయ్యారు. ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో జరిగే సీనియర్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున విజయనగరానికి చెందిన నలుగురు క్రీడాకారులు కె.అప్పలరాజు, జి.రాధ, కె.పవన్‌కుమార్, వై.ప్రవల్లికలు పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ మేరకు జాతీయ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వరరావు తన కార్యాలయంలో అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించి విజయనగరం జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావడంతో పాటు ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫెన్సింగ్ అసోసియేషన్ ముఖ్య శిక్షకుడు డీపీ చారిప్రసాద్ పాల్గొన్నారు.



జాతీయ ఫెన్సింగ్ పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులు

తడి నేలల పరిరక్షణకు కృషి చేయాలి

- కలెక్టర్ డాక్టర్ బీఆర్అంబేడ్కర్

విజయనగరం అర్బన్: జిల్లాలోని చెరువులు, కాలువలు తదితర జలావాసాలు, తడి నేలల పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చెప్పారు. దీని కోసం ముందుగా చెరువులు తదితర జలవనరుల సమగ్ర సర్వే నిర్వహించాలని సూచించారు. జిల్లా తడి నేలల (వెట్ ల్యాండ్స్) కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా జిల్లాలోని చెరువులు, కాలువలు తదితర తడి నేలలను సర్వే చేసి జాబితా తయారు చేయాలని సూచించారు.

పీఎంఏవై ఇళ్ల నిర్మాణానికి అదనపు సహాయం

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ, అర్బన్, పీఎంజన్‌మన్ పథకాల కింద గతంలో మంజూరై నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సహాయాన్ని ప్రకటించిందని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వెల్లడించారు. రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన అదనపు ఆర్థిక సహాయం వల్ల జిల్లాలో 12,240 మంది బీసీలకు, 2,231 మంది ఎస్సీలకు ఒక్కో ఇంటికి రూ.50 వేల వంతున ఆర్థిక సహాయం అందిస్తారని తెలిపారు. 565 మంది షెడ్యూల్డ్ తెగల వారికి రూ.75 వేలు వంతున, 190 మంది ఆదిమతెగల వారికి పీఎంజన్‌మాన్ కింద ఇళ్ల నిర్మాణాలకు ఒక్కో ఇంటికి రూ.లక్ష వంతున ఆర్థిక సహాయం అందించనున్నట్లు చెప్పారు.



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

గిరిజన వర్సిటీలో డ్రోన్లపై వర్క్‌షాప్ ప్రారంభం



జ్యోతిని వెలిగించి ప్రారంభిస్తున్న సెంచూరియన్ యూనివర్శిటీ డీన్ డాక్టర్ జే.అనీల్‌కుమార్, గిరిజన యూనివర్శిటీ ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు

విజయనగరం అర్బన్: డ్రోన్ల వినియోగంతో వ్యవసాయం రంగాన్ని లాభసాటిగా మెరుగుపరచవచ్చని సెంచూరియన్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ జె.అనిల్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. సెంచూరియన్ యూనివర్సిటీతో సంయుక్త నిర్వహణలో స్థానిక కేంద్రీయ గిరిజన యూనివర్సిటీలో 'వింగ్స్ ఆఫ్ ఇన్నోవేషన్: ఎంపవరింగ్ స్కిల్స్ త్రూ డ్రోన్ టెక్నాలజీ' అనే అంశంపై రెండురోజుల పాటు నిర్వహించే వర్క్‌షాప్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయరంగంలో డ్రోన్లను ఉపయోగించి వ్యవసాయం చేయగలిగితే తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల సాయంతో నీటి వనరుల లభ్యత, పురుగు మందుల పిచికారీ, ఎరువులు వేయడం తదితర పనులు తక్కువ ఖర్చుతో చేయడానికి అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొన్ని సంస్థలకు డ్రోన్లను రాయితీలపై అందజేస్తోందని తెలిపారు. పర్లాకిమిడి సెంచూరియన్ యూనివర్సిటీ నుంచి గౌరవ అతిథిగా వచ్చిన అసోసియేట్ డీన్ డాక్టర్ కొర్ల హర్షవర్ధన్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో డ్రోన్స్ వినియోగంపై వివరించారు. కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు మాట్లాడుతూ రక్షణ, వ్యవసాయం, ఇతర రంగాల్లో డ్రోన్ల అవసరం పెరిగిందన్నారు. కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ సోనియా పాణిగ్రాహి, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.లత, డాక్టర్ ప్రేమ ఛటర్జీ, డాక్టర్ ఎన్‌వీఎస్‌సూర్యనారాయణ, డాక్టర్ ఎంజీనాయుడు, డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, డాక్టర్ కె.దివ్య, డాక్టర్ ఎం.ప్రసాద్, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పారా అథ్లెటిక్స్‌లో రాణించిన లలిత

- కాంస్య పతకం కైవసం

విజయనగరం: న్యూ ఢిల్లీ వేదికగా ప్రారంభమైన ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్ 2025 పోటీల్లో 1500 మీటర్ల పరుగు పందెంలో ఉమ్మడి విజయనగరం జిల్లా క్రీడాకారిణి కిల్లక లలిత కాంస్య పతకం గెలుచుకుంది. ఆమె గెలుపు జిల్లాకు గర్వకారణమని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.దయానంద్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో 20 దేశాలకు చెందిన పారా క్రీడాకారులు పాల్గొన్నారని, గట్టి పోటీలో సైతం అసామాన్య ప్రతిభ కనబరచిన లలిత తానేంటో నిరూపించడమే కాకుండా అంతర్జాతీయస్థాయిలో విజయనగరం పేరు మారుమోగేలా చేసిందని ప్రశంసించారు. ఈ పతకం మన రాష్ట్ర క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని, ఇతర విభాగాల్లోనూ ఆమె పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించిన లలితకు కలెక్టర్ డాక్టర్. బీఆర్.అంబేడ్కర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావులు అభినందనలు తెలియజేశారని చెప్పారు.



లలిత

55 సెకెన్లలో హనుమాన్ చాలీసా పఠనం

- ప్రపంచ రికార్డు సాధించిన జయ పవన్‌కల్యాణ్

విజయనగరం టౌన్: హనుమాన్ చాలీసా పఠించడంలో విజయనగరానికి చెందిన జయ పవన్ కల్యాణ్ ప్రపంచ రికార్డు సృష్టించారు. 55 సెకెన్లలో హనుమాన్ చాలీసాను పూర్తిగా పఠించినందుకు గాను ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించాడు. ఈ మధ్య జరిగిన ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పోటీల్లో ఆయన పాల్గొని, హనుమాన్ చాలీసాను అతి తక్కువ నిడివిలో పూర్తిగా పఠించిన మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించాడు. గతంలో బీహార్‌కు చెందిన అబ్బాయి 59 సెకెన్లలో హనుమాన్ చాలీసా పఠించగా ప్రస్తుతం ఆ రికార్డును తిరగరాసి 55 సెకెన్లలో హనుమాన్ చాలీసాను పఠించడం గొప్ప విషయం. విజయనగరం నగర పాలక సంస్థలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తాతబాబు కుమారుడు జయపవన్ కల్యాణ్. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడంతో జయ పవన్ కల్యాణ్‌కు అందరూ అభినందనలు తెలియజేస్తున్నారు. ఆంధ్ర యూనివర్సిటీలో ఎంటెక్ పూర్తి చేసిన జయ పవన్ కల్యాణ్ అత్యంత సృజనను కనపరిచి ఈ రికార్డును సొంతం చేసుకోవడం విశేషం. ఈ మేరకు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్ సంస్థ వారు యూట్యూబ్, ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి అనేక సామాజిక మాధ్యమాల్లో జయపవన్ కల్యాణ్ సాధించిన రికార్డును నిక్షిప్తం చేశారు. దీంతో ఈ విషయం ప్రస్తుతం వైరల్ అవుతోంది.



జయ పవన్ కల్యాణ్

పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

- గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన నిందితులు
- బొడ్డవర చెక్‌పోస్ట్ వద్ద కారు టైరులో గంజాయి పట్టివేత

విజయనగరం క్రైమ్: గంజాయిని అక్రమంగా రవాణా చేసినా, అమ్మినా, కొనుగోలు చేసినా ఎన్డీపీఎస్ చట్టం ద్వారా కేసు నమోదు చేస్తామని ఎస్పీ వకుల్ జిందల్ మరోసారి స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఐదుగురు నిందితుల ముఠాను ప్రవేశపెట్టారు. బొడ్డవర చెక్‌పోస్ట్ వద్ద వెహికల్స్ తనిఖీ చేస్తుండగా కారు వెనుక భాగంలో స్టెఫినీ టైరులో గంజాయిని తరలిస్తున్న ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని ఈ సందర్భంగా కేసు వివరాలను ఎస్పీ వకుల్ జిందల్ వెల్లడించారు. చెక్ పోస్ట్ వద్ద ఎస్.కోట ఎస్సై ఎల్.చంద్రశేఖర్ వాహనాలు తనిఖీ చేస్తుండగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన కారు వెనక భాగంలో తనిఖీ చేస్తున్న సిబ్బందికి అనుమానం వచ్చి కారు స్టెఫినీని ఓపెన్ చేయగా డెబ్బై కిలోల గంజాయి 56 ప్యాకెట్లలో లభ్యమైందన్నారు. వెంటనే దానిని రవాణా చేస్తున్న ఒడిశాలోని మల్కన్‌గిరికి చెందిన రంజిత్ బిశ్వాస్, నిఖిల్ తపాయి, బిశ్వాస్ మహీధర్, యూపీకి చెందిన షా ఆలం, బెంగళూరుకు చెందిన షేక్ ఇజాజ్ అహ్మద్‌లను ఎన్డీపీఎస్ చట్టం కింద అరెస్ట్ చేశామని ఎస్పీ తెలిపారు. నిందితుల నుంచి ఒక కారు, నాలుగు మొబైల్ఫోన్స్, రూ.20 వేలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గంజాయిని అక్రమ రవాణాపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి పోలీస్ శాఖ వెనకాడబోదని ఈ సందర్భంగా ఎస్పీ స్పష్టం చేశారు.



గంజాయి తరలిస్తున్న నిందితులను విలేకరుల ముందు ప్రవేశ పెట్టిన ఎస్పీ, చిత్రంలో డీఎస్పీ శ్రీనివాస్, ఎస్.కోట సీఐ నారాయణ

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- రూ.88వేల620, 9స్మార్ట్‌ఫోన్‌లు, ఒక ల్యాప్‌టాప్,
- మూడు గోల్డ్ కలర్ వాచ్‌లు స్వాధీనం

గజపతినగరం: గజపతినగరం జాతీయ రహదారి పక్కన, మెంటాడ జంక్షన్ రోడ్డు ఇరువైపులా ఉన్న మొత్తం 8షాపుల్లో ఇటీవల చోరీకి పాల్పడిన దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు బొబ్బిలి డీఎస్పీ భవ్యారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం గజపతినగరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. గజపతినగరంలో దొంగతనాలకు పాల్పడిన వారు అంతర్ రాష్ట్ర గజదొంగలన్నారు. కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో వరుసగా వీరు దొంగతనాలకు పాల్పడుతూ వస్తున్నారని రాత్రి పూట ఎవరు లేని సమయంలో షట్టర్లు పగులగొట్టి నగదు, సొత్తు లూటీ చేయడమే వారి పని అని తెలిపారు. సీసీటీవీ ఫుటేజీ ద్వారా నిందితులను గుర్తించి నలుగురిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశామని చెప్పారు. అరెస్ట్ అయిన వారిని షేక్ బాషా, రావుల రమణ, శ్రీనునాయక్, గుల్లిపల్లి కిరణ్‌కుమార్‌లుగా గుర్తించినట్లు తెలిపారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు వెంకటేశ్ శివగౌడ, రంగురవిల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. నిందితుల నుంచి రూ.88వేల620నగదు, 9స్మార్ట్‌ఫోన్‌లు,ఒక ల్యాప్‌టాప్, మూడు గోల్డ్ కలర్ వాచ్‌లను రికవరి చేసినట్లు డీఎస్పీ వివరించారు. కార్యక్రమంలో సీఐ, ఎస్సైలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యారెడ్డి (వెనుక ముసుగులో నిందితులు)

నేడు కవయిత్రి మొల్లమాంబ జయంతి

పార్వతీపురం: కవయిత్రి మొల్లమాంబ జయంతిని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ, సాధికారత అధికారి ఎస్.కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

మడ్డువలస కాలువలో బాలిక మృతదేహం లభ్యం

వంగర: మండల పరిధి మడ్డువలస కుడి ప్రధాన కాలువలో గల్లంతైన కళింగ సైనీ మృతదేహం బుధవారం లభ్యమైంది. ఈ నెల 11వ తేదీన ఇద్దరు బిడ్డలతో సహా తల్లి కళింగ శ్రావణి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు దిగువ భాగం కుడి ప్రధాన కాలువలో దూకి ఆత్మహత్యాయత్నం చేసిన విషయం పాఠకులకు విదితమే. ఈ సంఘటనలో మహిళ కళింగ శ్రావణి, బాలుడు కళింగ సిద్ధులను సంగాంకు చెందిన జన్ని జగన్‌మోహన్(చిన్న) సాహసించి కాపాడి ఒడ్డుకు చేర్చగా బాలిక కళింగ సైనీ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో గజ ఈతగాళ్లు, పలువురు మత్స్యకారులు గాలించినా ఫలితం లేకపోయింది. చీకటి పడడంతో బంధువులంతా అక్కడే పడిగాపులు కాశారు. బుధవారం ఉదయం ఘటన జరిగిన ప్రదేశానికి కొద్ది దూరంలో బాలిక సైనీ మృతదేహం ఉన్నట్లు బంధువులు గుర్తించారు. బాలిక మేనమామ గుంట చంటి, కుటుంబసభ్యులు కాలువ నుంచి మృతదేహాన్ని తీసే ప్రయత్నంలో వారు రోదించిన తీరు అందరినీ కలిచివేసింది. మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చిన అనంతరం పోలీసులు రాజాం సీహెచ్‌సీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కింజంగి గ్రామానికి తరలించగా మృతదేహాన్ని చూసేందుకు వచ్చిన వారంతా చలించిపోయారు. బాలిక తండ్రి కళింగ సుధాకర్‌ను బాలిక మృతదేహం వద్దకు తీసుకువచ్చినా ఆయన మానసిక స్థితి బాగోలేక బిత్తర చూపులు చూశాడు.





బాలిక మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చుతున్న మేన మామ గుంట చంటి, (ఇన్‌సెట్లో) కళింగ సైనీ(ఫైల్)

జాతీయ రహదారిపై 64 సీసీ కెమెరాలు

- కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్
- హిట్ అండ్ రన్ కేసులకు ఆమోదం తెలిపిన కమిటీ


విజయనగరం క్రైమ్: జిల్లాలో తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారిపై 64 సీసీ కెమరాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ చాంబర్‌లో బుధవారం హిట్ అండ్ రన్ జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. విజయనగరం డివిజన్‌లో వాహనాలు ఢీకొని మృతి చెందిన, క్షతగాత్రులుగా మారిన మొత్తం 10 కేసులపై ఈ హిట్ అండ్ రన్ జిల్లా స్థాయి పర్యవేక్షణ కమిటీ సమావేశంలో సమగ్రంగా చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే సమావేశం నాటికి మొత్తం పెండింగ్ కేసులన్నిటినీ పూర్తి చేయాలని చెప్పారు. జిల్లాలో మొత్తం 34 కిలోమీటర్ల మేర ఉన్న 16వ జాతీయ రహదారిపై 64 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. వాటిని అమర్చే పని వేగంగా పూర్తి చేయాలని కోరారు. జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్‌లు, నేరాలు జరిగే చోట్లను దశల వారీగా అన్నిచోట్లా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. దీని కోసం సమగ్ర సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఏఎస్పీ సౌమ్యలత, ఇన్‌చార్జి జేసీ శ్రీనివాసమూర్తి, డీటీఓ మణికుమార్, డీఎంహెచ్ఓ పాల్గొన్నారు.



కలెక్టర్ చాంబర్‌లో జరుగుతున్న హిట్ అండ్ రన్ కమిటీ సమావేశం

పరిశోధన ప్రతిభతో ఉన్నత స్థాయిలో స్థిరం

విజయనగరం అర్బన్: కళాశాల విద్యలోనే విద్యార్థులు పరిశోధన దృక్పథంపై ప్రతిభను మెరుగుపరుచుకుంటే ఉన్నత స్థాయి ఉద్యోగ, ఉపాధిలో స్థిరపడవచ్చని జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి అన్నారు. ఈ మేరకు స్థానిక జేఎన్‌టీయూ జీవీలోని ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'క్రిసెన్స్ 2కే25' పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించే జాతీయ సాంకేతిక సదస్సును ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటికప్పుడు నూతనంగా ఆవిష్కరిస్తున్న సాంకేతిక పరిశోధనా అంశాలపై పరిజ్ఞానాన్ని విద్యార్థులు పెంచుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి సదస్సుల్లో విద్యార్థి పాల్గొంటే నూతన సాంకేతిక నిపుణతను మెరుగుపరచుకోవచ్చన్నారు. అనంతరం సదస్సు గ్రూప్ కెప్టెన్ పోలా ఆనంద్ నాయుడు సైబర్ థ్రెట్ ఇంటెలిజెన్స్ మరియు ప్రాక్టికల్ మెషీన్ లెర్నింగ్ అంశంపై సదస్సులో వివరించారు. సదస్సుకు సమన్వయ కర్తలుగా డాక్టర్ ఆర్‌డీడీ శివరాం, వి.నారాయణరావు, విద్యార్థి సమన్వయకర్తలుగా తనూజ్ హేమంత్, పెడాడ బలాశ్రీ వ్యవహరించారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి

ఎస్ఐపై దాడి

వేపాడ: మండలంలోని గుడివాడ గ్రామంలో వేణుగోపాలస్వామి తీర్థంలోబందోబస్తు విధులు నిర్వహిస్తుండగా మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దాడిచేశారని వల్లంపూడి ఎస్ఐ బి.దేవి ఎస్.కోట సీఐకు ఫిర్యాదు చేశారు. తీర్థంలో డాన్స్‌బేబీడాన్స్ కార్యక్రమంలో మహిళా డ్యాన్సర్లపై అసభ్యంగా ప్రవర్తిస్తున్న గుడివాడ మోహన్‌ను ఎస్ఐ మందలించారు. ఆయన వెంటనే బూతులు తిడుతూ దాడికి యత్నించాడని, అతని స్నేహితులు విష్ణు, దుర్గ, హర్ష, రంగాల ఎర్నిబాబు, సిమ్మ గౌరినాయుడు, గుడివాడ సంతోష్‌కుమార్, గుడివాడ కిషోర్, సింహాచలం నాయుడుతో కలిసి తన జుట్టు పట్టి ఈడ్చి కొట్టారని, సెల్‌ఫోన్ లాక్కొని విధులను ఆటంక పరిచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేశారు.

పదోతరగతి విద్యార్థులకు ఉచిత రవాణా

- ఆర్టీసీ డీపీటీఓ అప్పలనారాయణ



విజయనగరం అర్బన్: జిల్లాలో ఈ నెల 17వ తేదీ నుంచి జరిగే పదోతరగతి వార్షిక పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సేవలు అందిస్తామని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) సీహెచ్ అప్పలనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కండక్టర్‌కు హాల్‌టికెట్ చూపిస్తే చాలన్నారు. ఆర్టీసీ సంస్థ కల్పిస్తున్న ఈ సౌకర్యాన్ని పదోతరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.